# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 27-07-2025** **సమయం : 6.45 గంటలు**

# ముఖ్యాంశాలు

1. **ప్రధానమంత్రి నరేంద్రమోదీ "మన్ కీ బాత్" కార్యక్రమం ఈ ఉదయం 11 గంటలకు ప్రసారమవుతుంది.**
2. **ఐదు రోజుల పర్యటనలో భాగంగా ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఈ తెల్లవారుజామున సింగపూర్ చేరుకున్నారు.**
3. **కృత్రిమ మేధ పరిజ్ఞానాన్ని పూర్తిస్థాయిలో వినియోగించుకునేందుకు తగిన శిక్షణను ఉద్యోగులందరికీ ఇవ్వాలని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆదేశించారు.**
4. **కూటమి ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని ప్రగతి పథంలో నడిపిస్తుందని రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి పేర్కొన్నారు.**
5. **చేనేత రుణ మాఫీ పథకంలో లబ్ధిదారుల ఎంపికను వేగవంతం చేయాలని తెలంగాణ చేనేత, జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు.**

==========================

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే "మన్ కీ బాత్" మనసులోని మాట కార్యక్రమం 124వ సంచిక ఈ ఉదయం 11 గంటలకు ప్రసారం అవుతుంది. మన్ కీ బాత్ తెలుగు అనువాదం ప్రధాని ప్రసంగం అయిన వెంటనే ఒకసారి, రాత్రి 8 గంటలకు మరోసారి ఉభయ తెలుగు రాష్ట్రాలలోని అన్ని ఆకాశవాణి కేంద్రాల ద్వారా ప్రసారమౌతుంది.

--------------------------

ఐదు రోజుల పర్యటనలో భాగంగా ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఈ రోజు తెల్లవారుజామున సింగపూర్ చేరుకున్నారు. సింగపూర్‌లో ముఖ్యమంత్రికి ఘనస్వాగతం లభించింది. ఆంధ్రప్రదేశ్ అభివృద్ధిలో సింగపూర్ కీలక భాగస్వామిగా ఉన్నట్లు ఆయన సామాజిక మాధ్యమం వేదికగా పేర్కొన్నారు. నేడు సింగపూర్‌లో మంత్రులు, పారిశ్రామికవేత్తలు, ప్రవాసాంధ్రులతో పెట్టుబడులు, ఇతర అంశాలపై చర్చిస్తాని తెలిపారు. బ్రాండ్ ఏపీ ప్రోత్సహాకానికి సింగపూర్ పర్యటన మంచి అవకాశమని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

--------------------------

కృత్రిమ మేధ పరిజ్ఞానాన్ని పూర్తిస్థాయిలో వినియోగించుకునేందుకు తగిన శిక్షణను ఉద్యోగులందరికీ ఇవ్వాలని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆదేశించారు. హైదరాబాద్‌లో మర్రి చెన్నారెడ్డి మానవ

వనరుల అభివృద్ధి సంస్థ పాలకమండలి ఉప కమిటీ సమావేశంలో మంత్రులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్‌బాబుతో కలసి నిన్న ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉపముఖ్యమంత్రి మాట్లాడుతూ.. దేశంలోనే అత్యుత్తమ శిక్షణ సంస్థగా దీనిని అభివృద్ధి చేయాలన్నారు. ఇందుకు రాష్ట్ర ప్రభుత్వ నుంచి పూర్తి సహకారం ఉంటుందని చెప్పారు. ఈ సంస్థ స్వయం సమృద్ధితో ఆర్థికంగా పురోగతి సాధించాలని సూచించారు.

---------------------------

విజయవాడ నగరంలో డ్రైనేజీ సమస్యకు త్వరలో శాశ్వత పరిష్కారం చూపిస్తామని ఆంధ్రప్రదేశ్ పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పి.నారాయణ తెలిపారు. విజయవాడలోని కాలువలను సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి ఆయన నిన్న పరిశీలించారు. 2014–19ల మధ్య 500 కోట్ల రూపాయలతో ప్రారంభించిన పనులు తరువాత కాలంలో నిలిచిపోయాయన్నారు. ఈ పనులను ఆరు నెలల్లో పూర్తి చేసి నగర ప్రజలకు డ్రైనేజీ సమస్య నుంచి విముక్తి కల్పిస్తామన్నారు. అనంతరం మంత్రి పాత్రికేయులతో మాట్లాడుతూ..

...వాయిస్.. 30 సెకన్లు

---------------------------

కూటమి ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని ప్రగతి పథంలో నడిపిస్తుందని రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి తెలిపారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా, రావులపాలెం మండలం, గోపాలపురం గ్రామంలో స్థానిక ఎమ్మెల్యే బండారు సత్యానందరావుతో కలిసి పలు అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. అంతకు ముందు జరిగిన 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమంలో ఇంటింటి ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ..

..వాయిస్.. 28 సెకన్లు

---------------------------

ఇందిరమ్మ ఇళ్లు నిర్మించుకొనే వారికి మహిళా సంఘాల నుంచి లక్ష రూపాయలు రుణం అందిస్తామని తెలంగాణ రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. కరీంనగర్ జిల్లా చిగురుమామిడిలో ఆయన నిన్న పర్యటించారు. ఈ సందర్భంగా కొత్త రేషన్ కార్డులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. అర్హులందరికీ కొత్త రేషన్ కార్డులు మంజూరు చేస్తామని, ఇది నితరంతరం కొనసాగే ప్రక్రియ అని తెలిపారు.

---------------------------

ఐదు రకాల బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సదుపాయం కల్పించనున్నట్లు ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ శాఖ మంత్రి కె. అచ్చెన్నాయుడు తెలిపారు. కాకినాడ జిల్లా, ప్రత్తిపాడు నియోజకవర్గం పరిధిలోని అన్నవరంలో స్థానిక ఎమ్మెల్యే వి.సత్యప్రభ ఆధ్వర్యంలో నిర్వహించిన 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఆగస్టు 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ పథకం అమలు చేస్తామని చెప్పారు. ఆటోడ్రైవర్లకు ఆగస్టు 15న ఆర్థిక సాయం అందిస్తామన్నారు. ఆగస్టు 2, 3వ తేదీల్లో అన్నదాత సుఖీభవ సొమ్ము రైతుల ఖాతాల్లో జమ చేస్తామని వెల్లడించారు.

---------------------------

శాస్త్ర సాంకేతిక రంగాల పరిశోధకునిగా, రాష్ట్రపతిగా, విద్యార్థులకు మార్గనిర్దేశకుడిగా, రచయితగా అసమాన ప్రతిభా పాటవాలు చూపిన మహోన్నత వ్యక్తి డాక్టర్ అవుల్ పకీర్ జైనలుద్దీన్ అబ్దుల్ కలాం వర్ధంతి ఈరోజు. ఏపీజే అబ్దుల్ కలాంగా సుపరిచితమైన ఆయన భారతదేశ మిస్సైల్ మేన్‌గా ఖ్యాతి గడించారు. కలలు కనండి.. వాటిని సాకారం చేసుకోండి అని కలాం ఇచ్చిన పిలుపుతో యువతలో ఆత్మవిశ్వాసం నింపారు. శాస్త్రవేత్తగా వృత్తి జీవితాన్ని ప్రారంభించిన కలాం, అంతరిక్ష పరిశోధనల్లో భారత్‌కు ఎన్నో విజయాలు అందించారు. 2015 జులై 27వ తేదీన మేఘాలయ రాజధాని షిల్లాంగ్‌లో ఐఐఎం విద్యార్థులకు మార్గనిర్దేశం చేస్తూనే ఆయన తుదిశ్వాస విడిచారు. ఆయన సేవలకు గుర్తింపుగా దేశ అత్యుత్తమ పురస్కారం భారతరత్నతో సహా ఎన్నో జాతీయ, అంతర్జాతీయ పురస్కారాలు ఆయనను వరించాయి.

---------------------------

చేనేత రుణ మాఫీ పథకంలో లబ్ధిదారుల ఎంపికను వేగవంతం చేయాలని తెలంగాణ చేనేత, జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. చేనేత, జౌళిశాఖ పథకాల అమలుపై హైదరాబాదులో అధికారులతో నిన్న సమీక్ష నిర్వహించారు. రుణమాఫీ నిధులను లబ్ధిదారుల ఖాతాల్లో త్వరిత గతిన జమ చేయాలన్నారు. మహిళాశక్తి పథకంలో భాగంగా స్వయం సహాయక సంఘాల మహిళలకు అందించే చీరల ఉత్పత్తిని వేగవంతం చేయాలని సూచించారు.

---------------------------

ఉత్తర కోస్తాంధ్రప్రదేశ్, యానాం దిగువ ట్రోపో ఆవరణలో పశ్చిమ దిశగా గాలులు వీస్తున్నాయని భారత వాతావరణ కేంద్రం తెలిపింది. దీని ప్రభావంతో ఆంధ్రప్రదేశ్‌లోని పలు జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ శాఖ అధికారి ఎల్. నారాయణ తెలియజేస్తూ...

వాయిస్..19 సెకన్లు

మరోవైపు.. తెలంగాణలోనూ ఈరోజు, రేపు భారీ నుంచి భారీ వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది.

---------------------------

ఆంధ్రప్రదేశ్ లో 8 వందల 61 కోట్ల రూపాయలతో 20 వేల కిలోమీటర్లకుపైగా రోడ్లకు మరమ్మతులు చేశామని బిసి సంక్షేమ శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. పల్నాడు జిల్లా వినుకొండలో మంత్రి గొట్టిపాటి రవికుమార్, చీఫ్ విప్ జీవీ ఆంజనేయులుతో కలిసి నూతనంగా నిర్మించిన పలు రోడ్లను ఆమె నిన్న ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి సవిత మాట్లాడుతూ..వాహన దారులకు ఇబ్బంది లేకుండా రోడ్ల మరమ్మతులు, కొత్త రోడ్ల నిర్మాణం జరుగుతోందని తెలిపారు. ఏడాది పాలనలో జరిగిన రోడ్ల అభివృద్ధే ఇందుకు నిదర్శనమని పేర్కొన్నారు.

---------------------------

భారత్, ఇంగ్లాండ్ జట్ల మధ్య మాంచెస్టర్ వేదికగా జరుగుతున్న 4వ టెస్ట్ మ్యాచ్ తొలి ఇన్నింగ్స్‌లో ఇంగ్లాండ్ 669 పరుగులు చేసింది. భారత బౌలర్లలో రవీంద్ర జడేజా 4, జస్‌ప్రీత్ బుమ్రా 2, వాషింగ్టన్ సుందర్ 2, అంశుల్ కాంబోజ్, మహ్మద్ సిరాజ్ చెరో వికెట్ పడగొట్టారు. తొలుత బ్యాటింగ్ చేసిన భారత్ 358 పరుగులు చేసిన విషయం విధితమే. రెండవ ఇన్నింగ్స్ ప్రారంభించిన భారత్ ఆదిలోనే రెండు వికెట్లు కోల్పోయింది.

======================